అరగంట ముందే గేట్లు క్లోజ్

- నేడు, రేపు గ్రూప్-3 పరీక్షలు

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): గ్రూప్-3 పరీక్షలకు సర్వం సిద్ధమయ్యింది. ఆది, సోమవారాల్లో నిర్వహించే ఈ పరీక్షలకు అరగంట ముందుగానే పరీక్షాకేంద్రాల గేట్లు మూసేస్తారు. ఆలస్యంగా వచ్చే వారిని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరు. రాష్ట్రవ్యాప్తంగా 1,401 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 5.36లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షకు హాజరయ్యే వారు ఒరిజినల్ ఐడీతోపాటు బ్లూ లేదా బ్లాక్ కలర్ పెన్నును వెంట తీసుకెళ్లాలి.

25 నుంచి 'టెస్ట్'లు

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): డిపార్ట్‌మెంట్ టెస్ట్‌లు ఈ నెల 25 నుంచి నిర్వహిస్తున్నట్టు టీజీపీఎస్సీ అడిషనల్ సెక్రటరీ నవీన్ నికోలస్ శనివారం పేర్కొన్నారు. కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు చెందిన అభ్యర్థులకు సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) పద్ధతిలో పరీక్షలు నిర్వహించనున్నారు. 19 నుంచి హాల్‌టికెట్లను టీజీపీఎస్సీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వెల్లడించారు. హెల్ప్‌డెస్క్ 040-22445566 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

28 వరకు ఫీజు గడువు

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): పదో తరగతి వార్షిక పరీక్షల ఫీజు చెల్లింపు గడువును ఎస్సెస్సీ బోర్డు పొడిగించింది. 28 వరకు అవకాశం ఇచ్చింది. ఆలస్య రుసుము లేకుండా 28 వరకు, రూ.50 ఆలస్య రుసుముతో డిసెంబర్ 10, రూ. 200 ఆలస్య రుసుముతో డిసెంబర్ 19, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబర్ 30 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఇచ్చినట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు తెలిపారు. విద్యార్థులు ఆయా తేదీల్లోపు పాఠశాల హెచ్ ఎంలకు పరీక్ష ఫీజును చెల్లించాలని సూచించారు.

'ఇంజినీరింగ్'కు దరఖాస్తు

హైదరాబాద్, నవంబర్ 16(నమస్తే తెలంగాణ): జపాన్‌లో ఆటోమోటివ్ టెక్నీషియన్లు, సెమీకండక్టర్ ఇంజినీర్లు, ఆటోమొబైల్ సర్వీస్ అండ్ కస్టమర్ అసోసియేట్ ఉద్యోగాల భర్తీకి తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) దరఖాస్తులు ఆహ్వానించింది. అభ్యర్థులు 30 ఏండ్ల వయసుతోపాటు మెకానికల్, ఎలక్ట్రికల్, ఆటోమోటివ్ ఇంజినీరింగ్, కన్‌స్ట్రక్షన్ మెషినరీలో గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేట్ లేదా ఇంజినీరింగ్ పట్టా వుండాలని తెలిపారు. ఆసక్తిగలవారు tomcom.resume@gmail.comకు మెయిల్ చేయాలని సూచించారు.

23న 'నర్సింగ్' పరీక్ష

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): వైద్యశాఖలో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి 23న ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించనున్నట్టు మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తెలిపింది. మొదటి సెషన్ ఉదయం 9 నుంచి 10.20 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 12.40 నుంచి 2 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నది. పరీక్షకు పావు గంట ముందే గేట్లు మూసివేస్తామని, నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని స్పష్టంచేసింది. అభ్యర్థులు పరీక్ష రోజు గుర్తింపుకార్డును తీసుకురావాలని, వివరాలకు 7416908215కు ఫోన్ చేయాలని సూచించింది.

హైదరాబాద్‌లో ఐఐటీ మద్రాస్ రీసెర్చ్ సెంటర్

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఐఐటీ మద్రాస్ హైదరాబాద్‌లో రీసెర్చ్ సెంటర్‌ను నెలకొల్పనుటకు త్వరలోనే మండలితో ఎంవోయూను కుదుర్చుకోనున్నది. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి ఇటీవలే ఐఐటీ మద్రాస్‌ను సందర్శించి, డైరెక్టర్ కామకోటితో చర్చలు జరిపారు. రాష్ట్రంలో ఇంజినీరింగ్ సిలబస్‌లో మార్పులు, రీసెర్చ్ పార్క్‌లు, ఇన్నోవేషన్ హబ్‌లను ఏర్పాటు చేయాలని యోచిస్తున్న ఆయన ఐఐటీ మద్రాస్ సహకారం, వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చించారు. ఐఐటీ మద్రాస్ నిర్వహిస్తున్న ప్రవర్తక్, ఎన్‌పీటీఈఎల్, స్వయం ప్లస్ కోర్సులపై అధ్యయనం చేశారు.

'కామన్ స్కూల్' అమలు

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): మంత్రులు, కలెక్టర్, అటెండర్లు, కార్మికుల పిల్లలు అందరూ ఒకే పాఠశాలలో చదువుకునే కామన్ స్కూల్ విద్యావిధానాన్ని రాష్ట్రంలో ప్రవేశపెట్టాలని టీపీటీఎఫ్ ప్రతినిధి బృందం శనివారం విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని కలిసి కోరింది. ప్రతి తరగతికి ఒక టీచర్, ప్రాథమిక స్కూళ్లకు హెచ్‌ఎం పోస్టును మంజూరుచేయాలని కోరారు. నేతలు అశోక్‌కుమార్, నాగిరెడ్డి, వేణుగోపాల్, కొండల్‌రెడ్డి, రవీందర్, ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో తెలంగాణ

- రాష్ట్రంలో ఏరులై పారుతున్న మద్యం
- ఖజానా నింపుకుంటున్న ప్రభుత్వం
- సగటున 9 లీటర్లు తాగేస్తున్న ప్రజలు
- తాగుడులో పేదలదే సింహభాగం
- మద్యం ద్వారా 12శాతం ఆదాయం
- పల్లెల్లోనే వినియోగం అధికం
- జాతీయ సర్వేలో దిగ్భ్రాంతికరం

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో మద్యం ఏరులై పారుతున్నది. మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్న ప్రభుత్వం ప్రజలతో పని గట్టుకుని మరీ తాగిస్తున్నది. రాష్ట్ర బడ్జెట్‌లో 12 శాతం ఒక్క మద్యం వల్లనే సమకూరుతున్నది. ప్రపంచంలో విక్రయించే ప్రతి మూడు విస్కీ బాటిళ్లలో హాఫ్ బాటిల్ ఒక్క హైదరాబాద్‌లోనే అమ్ముడవుతున్నదంటే వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. తెలంగాణలో మద్యం వినియోగం ప్రమాదకరస్థాయిని దాటిపోయిందని ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి స్థాయిని మోడరేట్ రిస్క్‌గా భావించవచ్చని బ్రిటిష్ మెడికల్ జర్నల్ పేర్కొన్నది. డిస్టిలరీలు, బ్రూవరీల కోసం మద్యం ధరలు పెంచబోతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ధరల నిర్ణయ కమిటీ వేసింది. ఎక్సైజ్ కమిషనర్ సభ్యుడిగా ఉండే ఈ కమిటీ రాష్ట్రంలో మద్యం విక్రయాలు, వినియోగం మీద ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళకు మించి తెలంగాణలో మద్యం విక్రయిస్తున్నట్టు అందులో ఆ నివేదికలో కమిటీ పేర్కొన్నది. మద్యం వినియోగంతోపాటు ఆదాయంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నట్టు తెలిపింది. ఆ నివేదిక ప్రకారం, తెలంగాణ జనాభా 3.5 కోట్లు. ఈ ఏడాది నవంబర్ నాటికి రూ. 35,589 కోట్ల మద్యం విక్రయించారు. ఈ లెక్కన తలసరి మద్యం వినియోగం 9 లీటర్లు. బీర్ల వినియోగం 10.7 లీటర్లుగా ఉంది. ఆంధ్రప్రదేశ్ జనాభా 4.93 కోట్లు. నవంబర్ నాటికి మద్యం ద్వారా రూ. 23,804 కోట్ల దాయం సమకూరింది. తలసరి మద్యం వినియోగం 6.04 లీటర్లు.

గ్రామాల్లోనే అత్యధిక వినియోగం

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్) ఇటీవల వెల్లడించిన గణాంకాల్లోనూ మద్యం వినియోగంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నట్టు తెలిపింది. జాతీయ తలసరి మద్యం వినియోగం 5.06 శాతం కాగా, దేశంలో మద్యం తాగే వారి సగటు 9.9 శాతంగా ఉంది. తెలంగాణలో ఇది 10 శాతం అదనంగా నమోదైంది. రాష్ట్రంలో నిత్యం మద్యం తాగుతున్న వారి సగటు 19 శాతంగా ఉందని ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-5 సర్వే వెల్లడించింది. పట్టణాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో మద్యం తాగుతున్న వారి సంఖ్య 3 శాతం ఎక్కువగా ఉన్నట్టు వివరించింది. కొత్తగా మద్యానికి అలవాటు పడుతున్న వారి సంఖ్య పట్టణ ప్రాంతాల్లో తగ్గుతుండగా గ్రామీణ ప్రాంతాల్లో భారీగా పెరుగుతుండడంపై సర్వత్ర ఆందోళన వ్యక్తమవుతున్నది.

45 శాతం విక్రయాలు దక్షిణాదిలోనే

గ్లోబల్ స్టేటస్ రిపోర్టు ప్రకారం దేశంలోని మద్యం విక్రయాల్లో 45 శాతం ఐదు దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోనే జరుగుతున్నాయని స్పష్టం చేసింది. భారత్‌లో ఈ-కామర్స్, హోం డెలివరీలకు అనుమతి లేకపోయినా గ్రామీణ ప్రాంతాల్లో 19.9 శాతం మంది మద్యం తాగుతున్నట్టు తెలిపింది. ప్రపంచంలో అమ్ముడవుతున్న ప్రతి రెండు విస్కీ బాటిళ్లలో ఒకటి మన దేశంలోనే అమ్ముడుపోతోందని, అందులోనూ దక్షిణాది రాష్ట్రాలదే సింహభాగమని నివేదిక వివరించింది. రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న ఆదాయంలో 12 శాతం మద్యం అమ్మకాలపై పన్నుల ద్వారానే సమకూరుతున్నట్టు క్రిసిల్ పరిశోధన విభాగం లెక్కగట్టింది.

పేదలే ఎక్కువ

మద్యం తాగుతున్న వారిలో అత్యధిక వాటా పేదలదేనంటూ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే దిగ్భ్రాంతికర విషయం వెల్లడించింది. తెలంగాణలో 43.6 శాతం మంది పురుషులు, 6.7 శాతం మంది మహిళలు మద్యం తాగుతున్నట్టు తెలిపింది. పల్లెల్లో మద్యం దుకాణాలు లేకుండా చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వాటిని ప్రోత్సహించడమే కాక, దానిమీద వచ్చే ఆదాయంపైనే దృష్టిసారించింది. ఎక్సైజ్ అధికారులకు టార్గెట్లు విధించి మరీ బలవంతంగా మద్యం విక్రయిస్తున్నది. ఎక్సైజ్ అధికారులు చెప్తున్నదాని ప్రకారం రాష్ట్రంలో 1.75 లక్షల బెల్టు దుకాణాలు ఉన్నాయి.

గురుకులంలో విద్యార్థిని ఆత్మహత్య

- తరగతి గదిలో ఉరి వేసుకొని..
- సంగారెడ్డి జిల్లా కొత్తాపూర్‌లో ఘటన
- ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు

స్వాతి (ఫైల్)

సంగారెడ్డి, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ) : సంగారెడ్డి జిల్లాలో గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థిని ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకున్నది. తోటి విద్యార్థినుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని మియాపూర్‌కు చెందిన టీ స్వాతి (14) సంగారెడ్డి మండలం కొత్తాపూర్ బీసీ బాలికల గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నది. శనివారం స్వయంపాలన దినోత్సవం ఉండటంతో శుక్రవారం తోటి విద్యార్థినులతో కలిసి డ్యాన్స్ ప్రాక్టీస్‌లో పాల్గొంది. రాత్రి భోజనాల అనంతరం నిద్రపోయింది. శనివారం ఉదయం 5 గంటలకు లేచిన స్వాతి రెండో అంతస్తులోని తరగతి గదిలోకి వెళ్లి చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. తోటి విద్యార్థినులు విషయాన్ని పీడీ సుజాత దృష్టికి తీసుకెళ్లారు. ఆమె, సిబ్బంది వచ్చి గది తలుపు బద్దలుకొట్టారు. అప్పటికే స్వాతి మృతి చెందడంతో ప్రిన్సిపాల్ స్రవంతికి తెలిపారు. స్రవంతి సంగారెడ్డి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు స్వాతి మృతదేహాన్ని సంగారెడ్డి జనరల్ దవాఖానకు తరలించారు.

కుటుంబ సభ్యుల ఆందోళన..

స్వాతి మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తంచేశారు. తమ కూతురు ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, సమగ్ర విచారణ చేపట్టాలని తల్లి దివ్యవాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాల సిబ్బంది తీరుపై తమకు అనుమానాలు ఉన్నాయంటూ కుటుంబ సభ్యులు గురుకులం ఎదుట ఆందోళనకు దిగారు. డీఎస్పీ సత్తయ్య నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. పోస్టుమార్టం గది వద్ద కూడా కుటుంబ సభ్యులు నిరసనకు దిగారు. సీపీఐ, సీపీఎం నాయకులు మద్దతుగా పాల్గొన్నారు. సాంఘిక సంక్షేమశాఖ అదనపు కార్యదర్శి తిరుపతి ప్రభుత్వ దవాఖాన వద్దకు వచ్చి బాధిత కుటుంబ సభ్యులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మానసిక ఒత్తిడితోనే స్వాతి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని డీఎస్పీ సత్తయ్య తెలిపారు. స్వాతి పుస్తకాల్లో తన అక్క జానుకు రాసిన లేఖ దొరికిందన్నారు. తన అక్క జాను జన్మదినం వరకు తాను జీవించి ఉంటానో లేదోనని స్వాతి లేఖలో రాసిందని పేర్కొన్నారు. స్వాతి మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని డీఎస్పీ సత్తయ్య తెలిపారు.

విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రభుత్వానిదే బాధ్యత

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. శనివారం బాసర ట్రిపుల్ ఐటీకి వెళ్లిన ఏబీవీపీ నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఏబీవీపీ నాయకులపై పోలీసులు, బాసర ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బంది దాడి చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థినికి న్యాయం చేయమంటే విచక్షణారహితంగా దాడి చేయిస్తారా? అని మండిపడ్డారు. ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరుపడంతోపాటు ఆమె కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల డిమాండ్లను ప్రభుత్వం ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు.

గ్రూప్-3 పరీక్షకు కాంగ్రెస్ అడ్డంకులు

- 19న లక్ష మందితో విజయోత్సవ సభ
- ఓయూ ఆర్ట్స్ కాలేజీలో పరీక్ష
- అదే గ్రౌండ్‌లో మీటింగ్‌కు ఏర్పాట్లు
- కాంగ్రెస్ పెత్తంపై విమర్శలు

హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో కాంగ్రెస్ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్, మంత్రులు, ఎమ్మెల్యేలు

వరంగల్, నవంబర్ 16 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా వ్యవహరిస్తున్నది. ఉద్యోగాల భర్తీ కోసం పరీక్ష నిర్వహించే ప్రాంగణంలోనే కాంగ్రెస్ బహిరంగ సభ పెడుతున్నది. పరీక్షలు ముగిసిన తర్వాత రోజు బహిరంగ సభ ఉన్నా.. దీని ఏర్పాట్ల కోసం పరీక్ష రాసే వారికి ఇబ్బందులు కలిగించేలా వ్యవహరిస్తున్నది. టీఎస్‌పీఎస్సీ ఆది, సోమవారాల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్షల కోసం వరంగల్ నగరంలో సెంటర్లను ఎంపిక చేసింది. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో సెంటర్ ఏర్పాటు చేసింది. వెయ్యి మందికిపైగా అభ్యర్థులు ఇక్కడ పరీక్ష రాయనుండగా, శనివారం సాయంత్రం నుంచే ఈ కళాశాల పోలీసుల పర్యవేక్షణలోకి వెళ్లింది. మరోవైపు యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ నెల 19న బహిరంగసభ నిర్వహించేందుకు ఏర్పాట్లు మొదలయ్యాయి. సభ నిర్వహణ కోసం శనివారం పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు సురేఖ, శ్రీధర్‌బాబు, ప్రభాకర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు పరిశీలించారు. పరీక్ష జరుగుతున్నంత సేపు కాంగ్రెస్ బహిరంగ సభ కోసం పనులు చేపట్టనున్నారు. పరీక్ష సమయంలోనే సభ, వేదిక ఏర్పాట్ల కోసం అవసరమైన సామగ్రిని లారీల్లో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలోకి తీసుకురానుండటంతో అభ్యర్థుల ఏకాగ్రతకు భంగం వాటిల్లే ప్రమాదం ఉన్నది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 127 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నారని సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఆది, సోమవారాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. సభలు, ర్యాలీలు, ధర్నాలు నిషేధించినట్టు పేర్కొన్నారు.

జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గురుకులం వద్ద రోడ్డుపై బైఠాయించిన విద్యార్థినులు

ఈ ప్రిన్సిపాల్ మాకొద్దు

- రోడ్డెక్కిన 'లక్ష్మీపూర్' విద్యార్థినులు
- ప్రిన్సిపాల్ మమత సస్పెన్షన్

జగిత్యాల రూరల్, నవంబర్ 16: ప్రిన్సిపాల్ తమను వేధిస్తున్నదని ఆరోపిస్తూ జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌లోని బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు శనివారం రోడ్డెక్కారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్ తమను తన అవసరాలకు వాడుకుంటున్నదని, సెలవుల్లో ఇంటికి వెళ్లి ఆలస్యంగా వస్తే డబ్బులు వసూలు చేస్తున్నదని ఆరోపించారు. జరిమానా డబ్బుల లెక్కలు అడిగితే పాఠశాల అభివృద్ధి కోసమని చెబుతున్నదని అన్నారు. తమను చూడటానికి వచ్చిన తల్లిదండ్రుల పట్ల కూడా దురుసుగా ప్రవరిస్తున్నదని, సమయపాలన లేకుండా స్కూల్‌కు వస్తుందని, నిత్యం ప్రేయర్ లేట్ అవుతున్నదని, వెంటనే ఆమెను తొలగించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా కోఆర్డినేటర్ సుస్మిత విచారణ చేపట్టి ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆర్‌సీవో అంజలి స్కూల్‌కు వచ్చి వివరాలు తెలుసుకున్నారు. ఆర్‌సీవో మీడియాతో మాట్లాడుతూ ప్రిన్సిపాల్ మమతను సస్పెండ్ చేస్తూ స్టేట్ ప్రిన్సిపాల్ సెక్రటరీ సైదులు ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. ఆమె స్థానంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా చైతన్యను నియమించినట్టు పేర్కొన్నారు.

టెట్‌కు తగ్గుతున్న దరఖాస్తులు

- ఇప్పటివరకు 1.26లక్షల దరఖాస్తులు
- 22 వరకు సవరణకు అవకాశం

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయ ఉద్యోగార్థులకు నిర్వహించే టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)పై ఏటా ఆసక్తి తగ్గుతున్నది. టెట్ 2024కు ఇప్పటి వరకు 1.26 లక్షల దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. 2022లో 4.77 లక్షల దరఖాస్తులు సమర్పించగా, 2023లో 2.86 లక్షల దరఖాస్తులొచ్చాయి. గతంలో ఒకసారి ఏకంగా 6.28 లక్షల మంది దరఖాస్తు చేశారు. టెట్ దరఖాస్తుల గడువు 20వ తేదీతో ముగియనుంది. శనివారం వరకు టెట్ పేపర్-1కు 39,741, పేపర్-2కు 75,712, రెండు పేపర్లకు 10,599 చొప్పున మొత్తంగా 1,26,052 దరఖాస్తు చేసుకున్నారు. ఇది వరకు టెట్ నిర్వహించినప్పుడల్లా 4-6 లక్షల మంది దరఖాస్తు చేసేవారు. నిరుద్యోగులతోపాటు ఈ ఏడాది నుంచి కొత్తగా సర్వీస్ టీచర్లు టెట్‌కు హాజరవుతున్నారు. పదోన్నతులకు టెట్ తప్పనిసరి కాగా టీచర్లు సైతం టెట్ రాయాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఈ నేపథ్యంలో టెట్‌కు హాజరయ్యే వారి సంఖ్య పెరగాలి. కానీ అభ్యర్థుల నుంచి స్పందన మాత్రం అంతంత మాత్రంగా ఉంటున్నది. టెట్ వ్యాలిడిటీ గతంలో ఏడేండ్లు ఉండగా, దీనిని జీవితకాలం పొడిగించారు. దీంతో గతంలో టెట్ క్వాలిఫై అయిన వారు మళ్లీ టెట్ రాసేందుకు ఆసక్తిచూపడంలేదు. దరఖాస్తు చేసేందుకు మరో మూడు రోజులుండటంతో ఈ సంఖ్య పెరుగుతుందని అధికారులంటున్నారు. టెట్ దరఖాస్తుల్లో తప్పులను సవరించుకునేందుకు 22 వరకు ఎడిటింగ్‌కు అవకాశం ఇచ్చినట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నర్సింహారెడ్డి తెలిపారు. అభ్యర్థులు www.schooledu.telagana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే 7032901383, 90007561 78 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గతంలో టెట్ దరఖాస్తులు

సంవత్సరం	పేపర్ -1	పేపర్ -2
2016	88,661	2,51,906
2017	98,848	2,56,265
2022	3,18,444	2,50,897
2023	2,23,582	1,90,047
2024	39,741	75,712

కుప్పకూలిన రియల్ ఎస్టేట్

- పేదల ఇండ్ల కూల్చివేతలు ఆపాలి
- 'రియల్ ఎస్టేట్' అసోసియేషన్

ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

ఖైరతాబాద్, నవంబర్ 16: హైడ్రా ప్రభావంతో రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిందని తెలంగాణ రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అన్సర్ హుస్సేన్ తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగంపై 20 లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారని వెల్లడించారు. ఈ రంగం ద్వారా ప్రభుత్వానికి 22 శాతం ఆదాయం వస్తున్నదని చెప్పారు. కానీ ప్రభుత్వ చర్యల వల్ల ఈ రంగం కుప్పకూలిందని, ఎంతోమంది జీవితాలు రోడ్డున పడుతున్నాయని పేర్కొన్నారు. పేదలు, మధ్య తరగతి ప్రజలు ఎంతో కష్టపడి ఇల్లు కట్టుకుంటే.. ప్రభుత్వం మాత్రం పలు కారణాలతో కూలగొడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతులతో కట్టిన ఇండ్లను కూల్చడం సమంజసం కాదని చెప్పారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా వెన్నెల

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా డాక్టర్ గుమ్మడి వీ వెన్నెలను నియమిస్తూ యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజాగాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెల గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు.

నాలుగు జిల్లాలకు గ్రంథాలయ చైర్మన్లు

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని నాలుగు జిల్లా గ్రంథాలయ సంస్థలకు ప్రభుత్వం కొత్త చైర్మన్లను నియమించింది. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం శనివారం జీవోలను జారీచేశారు. జనగాం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఎం రాంబాబు, యాదాద్రి భువనగిరికి ఎండీ అవాజ్ ఉర్ రెహ్మాన్, హనుమకొండకు మహ్మద్ అజీజ్‌ఖాన్, మేడ్చల్ మల్కాజిగిరికి బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డిని చైర్మన్లుగా నియమించారు.

స్వేచ్ఛను హరించే వీడియోలను తొలగించండి

- యూట్యూబ్‌కు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): ప్రజల హక్కులకు, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించే వీడియోలను సోషల్ మీడియాలో పెట్టడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని హైకోర్టు తేల్చిచెప్పింది. అలాంటి వీడియోలను తొలగించాలని యూట్యూబ్ సంస్థను ఆదేశించింది. హైదరాబాద్‌లోని కోకాపేటకు చెందిన మొల్ల శివయ్యతోపాటు ఆయన భార్య, కుమారుడిపై బాచుపల్లికి చెందిన మురళీకృష్ణ దంపతులు 'మీమాంస విట్టిమ్స్' యూట్యూబ్ చానల్‌లో వీడియోలు పెట్టారు. తమ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉన్న వీడియోలను తొలగించాలన్న విజ్ఞప్తిని యూట్యూబ్ పట్టించుకోలేదని శివయ్య హైకోర్టును ఆశ్రయించడంతో జస్టిస్ శ్రవణ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

ఆ కంపెనీల అనుమతులు రద్దు చేస్తం: తుమ్మల

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఆయిల్‌ఫెడ్‌తోపాటు ప్రైవేటు ఆయిల్‌పాం కంపెనీల పనితీరుపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసహనం వ్యక్తంచేశారు. లక్ష్యానికి అనుగుణంగా ఆయిల్‌పామ్ సాగు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదే తీరు కొనసాగితే... కంపెనీలకు కేటాయించిన జిల్లాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. శనివారం సచివాలయంలో ఆయిల్‌పామ్ సాగు పురోగతిపై సమీక్ష నిర్వహించారు. 2024-25లో లక్ష ఎకరాల ఆయిల్‌పామ్ సాగు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 25,470 ఎకరాలలో ప్లాంటేషన్ పూర్తయిందన్నారు. ఫిబ్రవరి నాటికి లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే సంవత్సరం చివరికల్లా ప్రతి కంపెనీ ఫ్యాక్టరీ జోన్లలో ఆయిల్‌పామ్ గెలల ప్రాసెసింగ్ కర్మాగారాల ఏర్పాటు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ఏపీ సీఎం చంద్రబాబు సోదరుడు మృతి

హైదరాబాద్, నవంబర్ 16(నమస్తే తెలంగాణ): ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సోదరుడు రామ్మూర్తి నాయుడు (72) మృతిచెందారు. కొన్నేండ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను ఈ నెల 14న హైదరాబాద్‌లోని ఏఐజీ దవాఖానలో చేర్చారు. పరిస్థితి విషమించి శనివారం కన్నుమూశారు. సోదరుడి మరణవార్త తెలిసిన వెంటనే మహారాష్ట్ర పర్యటనలో ఉన్న చంద్రబాబు ఏఐజీ దవాఖానకు చేరుకొని నివాళులర్పించారు. రామ్మూర్తినాయుడు 1994లో చిత్తూరు జిల్లాలోని చంద్రగిరి నుంచి ఎమ్మెల్